క్లుప్తంగా

వైభవంగా ఎరుకుమాంబ తీర్థం



ఎరుకుమాంబ ఆలయం వద్ద అన్నసమారాధన

మాడుగుల రూరల్: వీరవల్లి గ్రామ శివారు ఎరుకువాడ మెట్ట పక్కన్న వెలిసిన ఎరుకు మాంబ తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఎడ్లబళ్ల పరుగు పందేలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కౌశెట్టివాని చెరువులో 'ఉపాధి' ప్రారంభం



పనులు చేస్తున్న కూలీలు

మాకవరపాలెం: స్థానిక కౌశెట్టివాని చెరువులో ఉపాధి పనులు ప్రారంభించారు. ఇక్కడ తొమ్మిదెకరాల విస్తీర్ణం చెరువులో 2009 నుంచి ఉపాధి పనులు చేయలేదని, సాగునీరు అందడం లేదని రైతులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించి ఆదేశించడంతో ఉపాధి పథకంలో భాగంగా చెరువులోని పూడిక తొలగించేందుకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు మొదటగా రూ.10 లక్షలు మంజూరైనట్టు ఏపీవో వరలక్ష్మి తెలిపారు. దీంతో గురువారం నుంచి చెరువులో పూడిక తొలగింపు పనులు ప్రారంభించామన్నారు.

కూండ్రపువానిపాలెంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ

కె.కోటపాడు: వేసవి దృష్ట్యా ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సామాజిక బాధ్యతతో కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కింతాడకు చెందిన రావాలమ్మ తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు కస్నూరు సూర్యనారాయణ తెలిపారు. తాపీమేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో కూండ్రపువానిపాలెం జంక్షన్ వద్ద గురువారం ఆయన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వాహనదారులు, పాదచారులు అవకాశం మేరకు ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణాలు సాగించాలని సూచించారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

గొలుగొండ: ప్రజలు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని ఎస్‌ఐ కృష్ణారావు తెలిపారు. రావణాపల్లి చెరువు వద్ద ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి వివాదాలకు పాల్పడవద్దన్నారు. ఎన్నిలకు సజావుగా నిర్వహించేందుకు గ్రామాల్లో ప్రజలు సహృద్భావంతో మెలగాలని సూచించారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రతీ గ్రామంలో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

నర్సీపట్నం: మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్లు, స్టేషన్ మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సుబ్బారాయుడుపాలెం, చెట్టుపల్లి, కుసర్లపూడి, రొంగలపాలెం, జేపీ అగ్రహారం, వెలంకాయలపాలెం, నిండుగొండ, ఎస్.కొత్తూరు, జానకీరాంపురం, రోలుగుంట, గురందొరపాలెం, నగరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు గమనించాలని సూచించారు.

జీపు కొనలేని కురువృద్ధుడికి కోట్ల ఆస్తులా?

- అయ్యన్నపాత్రుడిపై ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ధ్వజం
- ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ ప్రజలు బ్రహ్మారథం



ప్రచారంలో పాల్గొన్న వార్డు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు



ఎమ్మెల్యే గణేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

నర్సీపట్నం: ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. రెండో రోజు గురువారం మున్సిపాలిటీలోని 3, 4, 6, 7 వార్డుల్లో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ఆయా వార్డుల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. రెట్టించిన ఉత్సాహంతో ఎమ్మెల్యే మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఇంటింటికీ తిరిగారు. పట్టణం ప్రశాంతంగా ఉండాలన్నా, అభివృద్ధి చెందాలన్నా వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఓటర్లను అభ్యర్థించారు. మహిళలు పూల వర్షం కురిపించి.. హారతులు పట్టి విజయీభవ అంటూ ఆయన్ను దీవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు అయ్యన్నపాత్రుడుకు ప్రజలు అధికారం కట్టబెడితే కోట్ల ఆస్తులు సంపాదించుకుని అభివృద్ధిని గాలికి వదిలేశాడన్నారు. 1983లో చందాలతో జీపు కొనుకున్న అయ్యన్నపాత్రుడు నేడు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. అధికారం రాకుండానే అయ్యన్నపాత్రుడు కొడుకు రెడ్ బుక్‌లో పేర్లు రాశానంటూ ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ధ్వజమెత్తారు. అయ్యన్నకు ఓటేస్తే ప్రశాంతంగా ఉన్న నర్సీపట్నం సర్వనాశమవుతుందన్నారు. వయస్సు పైబడడంతో జ్ఞాపిక శక్తి లోపించి రోజూ నోటికొచ్చినట్టు పిచ్చిగా వాగుతున్నాడని ఎద్దేవా చేశారు. మనుషులను గుర్తు పట్టలేని పరిస్థితులో తండ్రి ఉంటే, కొడుకు అధికారాన్ని చెలాయిస్తున్నాడని విమర్శించారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ ప్రజలకు చేసిందేమి లేదని తూర్పారపట్టారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి ఒక్కరిని లక్షాధికారిని చేయటమే జగనన్న లక్ష్యమన్నారు. ఈ సారి ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి అయ్యన్నపాత్రుడిని అల్లిపూడి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, గొలుసు సుమజ, వార్డు కౌన్సిలర్లు చెక్కా బాలమ్మ, మామిడి అరుణ, మామిడి శ్రీను, దాడి కృష్ణవేణి, యాదగిరి మణి, దాడి బుజ్జి, యాదగిరి శేషు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్‌సీపీకి మద్దతు

- మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ



చీడికాడలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న అనురాధ



కె.జె.పురంలో మహిళలతో కలసి ప్రచారంలో అనురాధ

మాడుగుల రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు పలకాలని మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. కె.జె.పురంలో గురువారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఐదు సంవత్సరాల పాలనలో తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వం వల్ల లబ్ధి చేకూరితే తమకు ఓటు వేయాలని ఎన్నికల సభలో సీఎం జగన్ ఎంతో నిబద్ధతతో కోరుతున్నారన్నారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు, మాడుగుల నుంచి పోటీ చేస్తున్న తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, ఏఎంసీ డైరెక్టరు భీశెట్టి జగ్గప్పారావు, నాయకులు కాళ్ల అప్పలనాయుడు, పెంటకోట మాలినాయుడు, మళ్ల కన్నబాబు, యల్లపు శ్రీను, ఎం.వి.సత్యనారాయణ, అచ్చిమినాయుడు, జగన్, శంకర్, గోవిందరాజులు, మహిళలు పాల్గొన్నారు.

చీడికాడలో రెండోరోజు కొనసాగిన ప్రచారం

చీడికాడ: మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఎన్నికల ప్రచారం రెండో రోజు గురువారం చీడికాడలో కొనసాగింది. ఆమె తన తల్లి బూడి రమణమ్మతో కలిసి ఇంటింటికీ తిరిగారు. వారికి ప్రతి ఇంటా మహిళలు హారతులతో స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి ఓటర్లకు వివరించారు. నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దిన ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, మాడుగుల అభ్యర్థి అనూరాధను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, ఈర్లె చైతన్య, పరవాడ మహేష్, రామారావు, అప్పారావు, సిమెంట్ నాయుడు, శిరికోల మహేష్, రెడ్డి బలరాం పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించండి

- ఎమ్మెల్యే గణేష్ సతీమణి కళావతి
- తాండవ, మాధవనగరంలో ఎన్నికల ప్రచారం



తాండవ వీధుల్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్ సతీమణి కళావతి

నాతవరం: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రెండోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సతీమణి కళావతి కోరారు. గురువారం రాత్రి మాధవనగరం పంచాయతీలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ పొలిమేరలో సర్పంచ్ సామల చింతల్లి, వైస్ సర్పంచ్ సిద్దాబత్తుల సత్యవేణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిద్దాబత్తులు వెంకటరమణ ఘన స్వాగతం పలికారు. ఇక్కడ ఇంటింటా కళావతి తిరుగుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎం చేస్తే ఇప్పుడు వస్తున్న సంక్షేమ పథకాలు కంటే రెట్టింపు అందిస్తారన్నారు. దీన్ని గుర్తించి మనమంతా కష్టపడి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించే బాధ్యత మనపై ఉందన్నారు. ముందుగా చమ్మచింత పంచాయతీ శివారు తాండవ గ్రామంలో కళావతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు తీసుకునే లబ్ధిదారులంతా ఫ్యాను గుర్తుకు ఓటేస్తే రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ కూటమి అభ్యర్థులు అడ్రస్ లేకుండా పోతారన్నారు. గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అవలీలగా గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, కాపు, పామాయిల్ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు శిరుసుపల్లి నర్సింగరావు, పైల పోతురాజు, నాయకులు కరక అప్పలరాజు, మైనం వెంకట భాస్కర్, శెట్టి నూకరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన ఫ్యాన్ల ఏర్పాటు



రాజుపేట అగ్రహారం పోలింగ్ కేంద్రం వద్ద సూచనలు చేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: రాజుపేట అగ్రహారం పోలింగ్ కేంద్రంలో యుద్ధప్రాతిపదికన ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో జాగరపు రాంబాబు ఆదేశించారు. ఈ గ్రామంతోపాటు లింగంపేట, మన్యపురట్ల గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. కమిషనర్ ఆదేశాల ప్రకారం ఎన్నికల కోడ్ నియమ, నిబంధనలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై సూచనలు చేశారు. విద్యుత్, తాగునీటి, తదితర సదుపాయాలపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎండాకాలంలో చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై కార్యకర్తలకు సూచించారు. మెనూ విధిగా అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే



మాడుగులలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ, తదితరులు



ఎ.కోడూరులో పూలేకి నివాళి అర్పిస్తున్న దృశ్యం

మాడుగుల: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని వైఎస్సార్ సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ తెలిపారు. గురువారం మాడుగుల పట్టణంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఆమె ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే, సావిత్రిభాయి దంపతులు పుణెలో తొలిసారిగా 1848లో మహిళా పాఠశాల ప్రారంభించారన్నారు. ఆనాడు వారు వేసిన పునాది వల్లే నేడు దేశంలో పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, షేక్ ఉన్నీషా, సర్పంచ్ ఎడ్ల కళావతి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెరుమళ్ల వెంకటరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, నాయకులు సుందరరాజు, వేమన గణేష్, నేమాల గురువునాయుడు, సయ్యపురెడ్డి సత్తిబాబు, బసవా రామ పరమేష్, కుక్కర శ్రీధర్ పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త పూలే

కె.కోటపాడు: సమాజంలో కుల వివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి వాటిని రూపుమాపేందుకు కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని గణిత ఉపాధ్యాయుడు అమృతరావు అన్నారు. గురువారం ఎ.కోడూరు హైస్కూల్‌లో పూలే 197వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అమృతరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు, మహిళలకు విద్యావకాశం కల్పించిన ఘనత పూలేకు దక్కుతుందన్నారు.

సారా, మద్యం విక్రయాలపై ఆకస్మిక దాడులు



బేతపూడి పరిసరాలలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

దేవరాపల్లి: సారా తయారీ చేసినా, విక్రయించినా ఎంతటి వారినైన ఉపేక్షించేదిలేదని, కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని చోడవరం ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బిహెచ్. కిరణ్ మణేశ్వరి హెచ్చరిక జారీ చేశారు. రైవాడ పంచాయతీ శివారు బేతపూడి పరిసరాల్లో సారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలపై గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎవరూ పట్టుబడలేదు. సారా, మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు విక్రయించిన వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ఇప్పటికే ప్రత్యేక నిఘా ఉంచామని, ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సారా తయారీ, మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు విక్రయం లేదా రవాణాకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కె.కోటపాడు సీఐ బి.సిహెచ్. స్వామినాయుడు, దేవరాపల్లి ఎస్‌ఐ డి. నాగేంద్ర, కె.కోటపాడు, చీడికాడ, ఎ. కోడూరు ఎస్‌ఐలు, అనకాపల్లి ఎస్ఈబీ ఎస్‌ఐ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో ముమ్మరంగా తనిఖీలు



గన్నవరం మెట్ట వద్ద బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

నాతవరం: నర్సీపట్నం – తుని మధ్య గన్నవరం మెట్ట వద్ద పోలీసు చెక్‌పోస్టు వద్ద గురువారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఇక్కడ రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని ఎంపీడీవో రాంబాబు, పోలీసులు స్క్వాడ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఈ ప్రాంతం నుంచి మద్యం, నగదు అధికంగా రవాణా అవుతుందన్న ప్రచారం నేపథ్యంలో ద్విచక్ర వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణికులను సైతం తనిఖీ చేసి విడిచి పెడుతున్నారు. అనుమానం ఉన్న ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

వెలవెలబోయిన వారపు సంత



వేసవి తాపంతో బోసిపోయిన కశింకోట వారపు సంత

కశింకోట: మండల ప్రజలు గురువారం వేసవి తాపంతో సతమతమయ్యారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో అత్యవసర పనులున్న వారు తప్ప అత్యధిక శాతం మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో ఇక్కడి ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక బోసిపోయాయి. కశింకోటలో వారపు సంత కొనుగోలుదారులు లేక వెలవెలబోయింది. వ్యాపారులు ఎండకు తాళలేక దుకాణాలు విడిచి నీడ పట్టుకు చేరారు. దీంతో సంత జరిగే ప్రాంతం బోసిపోయింది. ఎండ తీవ్రత తగ్గడంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత యథావిధిగా సంత సాగి కళకళలాడింది. స్థానికులతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి తమకు కావలసిన కూరగాయలు, ఆకుకూరలు, మసాలా దినుసులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.25, టమాటా, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, దొండకాయ, బెండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, బీరకాయ రూ.60, చిక్కుడు రూ.80ల చొప్పున విక్రయాలు సాగాయి.

టీడీపీలో మా పార్టీ వారు చేరలేదు

- వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామన్

రోలుగుంట: తమ పార్టీ నుంచి టీడీపీలో ఎవరూ చేరలేదని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె రామన్ స్పష్టం చేశారు. టీడీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు మద్దతుగా ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తులు తాతయ్యబాబు గురువారం రాత్రి కొమరవోలులో ప్రచారం చేశారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన బండారు దొరబాబు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరినట్టు ఎమ్మెల్యే అభ్యర్థి రాజు పార్టీ కండువాతో ఆహ్వానించారు. దీనిపై గొర్లె రామన్ పై విధంగా స్పందించారు. దొరబాబు తమ పార్టీలో ఎప్పుడూ ఏ కార్యక్రమంలో పాల్గొనలేదని వివరించారు. ఈ విషయాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్

- రంజాన్ వేడుకలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



మాడుగుల: రంజాన్ వేడుకలో ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ, తదితరులు



కాశీపురంలో ఈద్ ముబారక్ తెలియజేసుకుంటున్న ముస్లింలు

మాడుగుల/మాడుగల రూరల్/దేవరాపల్లి: మాడుగుల మసీదులో ముస్లింలతో కలిసి మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. దేవరాపల్లి మండలం కాశీపురం మసీదులో మానవాళి హితాన్ని ఆకాంక్షించే పవిత్ర రంజాన్ పర్వదిన గొప్పతనాన్ని మత పెద్దలు వివరించారు. మతపెద్దలతోపాటు చిన్నారుల సైతం ఆలింగనం చేసుకొని ఒకరికొకరు ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పార్టీ మాడుగుల మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, షేక్ ఉన్నీషా, సర్పంచ్ ఎడ్ల కళావతి, నాయకులు పొలిమేర చిన్నారావు, ఎడ్ల హేమంత్ కుమార్, సయ్యపురెడ్డి సత్తిబాబు, కోట్యాడ భాస్కర్, నూతిగట్టు నాగశంకర్ పాల్గొన్నారు. కె.జె.పురం మసీదులో మత గురువు ఇద్ ముబారక్ సారథ్యంలో ఉదయం నుంచి పార్థనలు చేశారు. మసీదు అధ్యక్షుడు షేక్ సూరిసాహెబ్, చీడికాడ మండల కోప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, ఖాదర్ బాషా, బాబ్జి, మస్తాన్ పాల్గొన్నారు.

రావికమతం/రోలుగుంట: రావికమతం, కొత్తకోట మసీదుల్లో రంజాన్ వేడుక గురువారం ఘనంగా జరిగింది. రోలుగుంట మండలంలో ఎస్.కొత్తూరు, గొల్లపేట, కె.నాయుడుపాలెం గ్రామాల ముస్లింలు నిండుగొండలో మసీదులో రంజాన్ వేడుకలు నిర్వహించారు. కొవ్వూరు, కొండపాలెం, పాపంపేట తదితర గ్రామాల్లో ముస్లింలు రోలుగుంట మసీదులోను, అడ్డసరం, శరభవరం, బుచ్చింపేట తదితర గ్రామాల ముస్లింలు నర్సీపట్నంలో ప్రార్థనలు చేశారు.

మాకవరపాలెం/గొలుగొండ: మాకవరపాలెం, గొలుగొండ మండలం చీడిగుమ్మల, ఏఎల్‌పురంలో మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. పేద ముస్లింలకు సాయం అందించారు. మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: కె.జె.పురం మసీదులో పార్థనలు చేస్తున్న ముస్లింలు



మాకవరపాలెం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రోలుగుంట మసీదులో ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు

వలంటీర్లపై చంద్రబాబుది కపట ప్రేమ



మాట్లాడుతున్న సర్పంచ్ చిటికెల పద్మ

రోలుగుంట: వలంటీర్ల పట్ల టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కపట ప్రేమ చూపిస్తున్నారని జె.పి.అగ్రహారం సర్పంచ్ చిటికెల పద్మ విమర్శించారు. గురువారం ఆమె మాట్లాడుతూ 40 సంవత్సరాలు ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు వలంటీర్లపై వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ప్రజలకు వలంటీర్ల ద్వారా అందుతున్న సంపూర్ణ సేవల వల్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందని అక్కసుతో కోర్టుకెళ్లి ఎన్నికల కమిషన్‌తో వారిని నిలుపుదల చేశారన్నారు. గతంలో వలంటీర్లు నక్సలైట్లు అని, వలంటీర్ వ్యవస్థ శుద్ధ దండగ అని విమర్శించారన్నారు. ఇప్పుడు మాట మార్చి కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు పెంచుతామని ప్రలోభపెడుతున్నారని దుయ్యబట్టారు. ఇలా పూటకోమాట చెప్పే చంద్రబాబును ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మాట తప్పని మడమ తిప్పని నేత జగనన్న అని, ఎన్నికల హామీలను శతశాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి అని ప్రశంసించారు.